వారసత్వ సంపద రక్షణకు పాటుపడాలి



వాలంటీర్లకు శిక్షణ ఇస్తున్న అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, ప్రపంచ వారసత్వ సంపద కలిగిన కట్టడాల కోసం వాలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. రామప్పలో కొనసాగుతున్న శిక్షణ శిబిరాన్ని ఆమె సాయంత్రం సందర్శించి వాలంటీర్లతో మాట్లాడారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వారసత్వ కట్టడాల రక్షణ కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. రామప్ప ఖ్యాతిని ప్రపంచ దేశాలకు విస్తరించేలా చూడాలన్నారు. రామప్ప అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రామప్పలో మరింత అభివృద్ధి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు, శ్రీధర్‌రావు, పర్యాటకశాఖ అధికారి సూర్యకిరణ్, తదితరులు ఉన్నారు.

ఎనుమాములకు పోటెత్తిన తెల్లబంగారం



వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం తెల్లబంగారం పోటెత్తింది. సుమారు 10వేల పత్తి బస్తాలు మార్కెట్‌కు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో ఇంత మొత్తంలో పత్తి రావడం ఇదే తొలిశారన్నారు. పంట చేతికొస్తున్న తరుణంలో. సోమవారం వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరుచుకోకపోవడంతో.. దిగుబడులు ఎక్కువగా వచ్చినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మార్కెట్‌లో సోమవారం క్వింటా పత్తికి గరిష్ఠ ధర రూ.7,100, కనిష్ఠ ధర రూ.5,500 పలికింది. పాత పత్తికి క్వింటా రూ.7,520 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. **- న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్**

అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధికి కృషి

తాడ్వాయి, న్యూస్‌టుడే: దశాబ్దాల కాలంగా వెనకబాటుకు గురైన ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మంత్రి జిల్లాలోని పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాడ్వాయి మండలంలోని 10 గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు పరిచే విధంగా రూ.10.89 కోట్ల సీఆర్ఆర్, ఎమ్మార్ఆర్ నిధులతో నిర్మాణం చేపట్టే రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తాడ్వాయిలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లాలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు అటవీశాఖ నిబంధనలు అడ్డు పడుతున్నాయని, దీనిపై కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ప్రజలు దగ్గరుండి రహదారులను అభివృద్ధి చేసుకోవాలన్నారు. మేడారం పరిసర గ్రామాలకు మంజూరైన రోడ్ల నిర్మాణాలను నాణ్యంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. వచ్చే జాతర నాటికి అవసరమైన ప్రతి పనిని చేపట్టాలన్నారు.

రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి..



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, చిత్రంలో కలెక్టర్, తదితరులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామీణ రోడ్లను సుమారు రూ.8 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని సీతక్క చెప్పారు. గోవిందరావుపేట మండలంలోని పలు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అధికారులు, గ్రామస్థుల పరస్పర సమన్వయంతో రోడ్ల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించేలా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మొద్దులగూడెం గ్రామంలో 13 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా పాలనాధికారి టీఎస్ దివాకర, డీఈఈ ధర్మేందర్‌రావు, డీఎస్పీ రవీందర్, తహసీల్దార్లు రవీందర్, సృజన్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ ఈఈ అజయ్‌కుమార్, డీఈఈ ధర్మేంద్ర, ఏఈ రాజయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండలాధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, బొల్లు దేవేందర్, మేడారం జాతర ఉత్సవ కమిటీ ఛైర్మన్ అర్రెం లచ్చుపటేల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో ధాన్యం కొనుగోళ్లు

జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం రాంపతి



ముఖాముఖి

ములుగు, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్ల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, కొనుగోలు సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బండావత్ రాంపతి పేర్కొన్నారు. వివిధ శాఖల సమన్వయంతో కొనుగోళ్లను విజయవంతం చేస్తామన్నారు. సోమవారం ఆయనతో 'న్యూస్‌టుడే' నిర్వహించిన ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు.

న్యూస్‌టుడే: జిల్లా పరిధిలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కల్పించే వసతులు?

డీఎం: మొత్తం 178 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో సన్నధాన్యం కోసం 162, దొడ్డు వడ్ల కోసం 16 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. అవసరమైతే మరిన్ని కేంద్రాలను పెంచుతాం. ఎత్తయిన ప్రదేశంలో కేంద్రాల ఏర్పాటు, టెంటు, కుర్చీలు, తాగునీటి వసతి కల్పిస్తాం. 17 లోపు తేమ శాతం ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తారు. గన్నీ సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. తూకమైన వెంటనే గోదాముకు తరలిస్తాం.

సన్నధాన్యాన్ని ఎలా నిర్ధారిస్తారు?

సన్నధాన్యం నిర్ధారణకు గ్రేన్ క్యాలిపర్ అనే యంత్రాలను సమకూర్చాలని జిల్లా మార్కెటింగ్ శాఖకు ప్రతిపాదించాం. ప్రతి కేంద్రంలో ఒకటి చొప్పున మొత్తం 200 యంత్రాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆ యంత్రం ద్వారా 33 రకాల సన్నధాన్యాన్ని నిర్ధారించుకోవచ్చు.

రైతులకు బోనస్ ఎలా చెల్లిస్తారు?

మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు జరుగుతాయి. గ్రేడ్ 'ఏ' ధాన్యానికి క్వింటాకు రూ.2,320, కామన్ వెరైటీకి రూ.2,300 చెల్లిస్తాం. కొనుగోలు పూర్తయి ఆన్‌లైన్‌లో నమోదైన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమవుతాయి. ఆ తర్వాత సన్నాలకు ప్రభుత్వం చెల్లించే క్వింటాకు రూ.500 బోనస్ డబ్బులు ధాన్యం డబ్బులు పడిన రెండు గంటల వ్యవధిలో ప్రత్యేకంగా బోనస్ కింద ఖాతాలో జమ చేస్తారు. బోనస్ ఎంత వచ్చిందనేది రైతుల మొబైల్‌కు సంక్షిప్త సందేశం వస్తుంది.

కొనుగోళ్లపై ఎలా ముందుకెళ్తున్నారు?

అన్ని ప్రభుత్వ శాఖల సహకారం అవసరం. ప్రధానంగా కేంద్రాల నిర్వాహకులు, ఏఈవోలు, ఏవోలు, డీసీవో, డీఆర్‌డీవో, జీసీసీ, మార్కెటింగ్, రవాణా, కార్మిక, వ్యవసాయ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరాల శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటున్నాం. ఈనెల 23న జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించాం. పలు అంశాలపై చర్చిస్తాం.

ఏటా కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నారనే విమర్శలున్నాయి. దీనికి మీరేమంటారు?

ఇబ్బందులు రాకుండా జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తు.. ప్రత్యేకంగా మొబైల్ నెంబర్‌ను కేటాయిస్తున్నాం. సమస్య ఉంటే వెంటనే ఫిర్యాదు చేయొచ్చు. కంట్రోల్ రూంలో కో-ఆపరేటివ్, డీఆర్‌డీవో, డీసీవో, జీసీసీ శాఖలకు చెందిన ప్రతినిధులుంటారు. ఫిర్యాదును నమోదు చేసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు.

సక్రమ కొనుగోళ్లకు తీసుకునే చర్యలు?

తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల పరిధిలోని కేంద్రాల నిర్వాహకులకు తాడ్వాయిలోని రైతు వేదికలో, ములుగు, వెంకటాపూర్ మండలాలకు చెందిన వారికి జిల్లా కలెక్టరేట్‌లో, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల వారికి ఏటూరునాగారంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. కేంద్రాలకు సంబంధించి మహిళా సంఘాల పాత్ర కూడా కీలకం. ఐకేపీ మహిళలకు జిల్లాలో 33 కేంద్రాలు కేటాయించాం. వారికి కూడా శిక్షణ ఇస్తాం. ప్రతి కేంద్రంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల ఫోన్‌నంబర్లతో బ్యానర్ ఏర్పాటు చేస్తాం. అదే బ్యానర్‌పై కంట్రోల్ రూం నెంబర్ కూడా ఉంటుంది.

ఈ సన్నరకాలకే.. రూ.500 బోనస్ 6లో..

'మోడికుంట ప్రాజెక్టుపై శాసనసభలో చర్చిస్తా'



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు

వాజేడు, న్యూస్‌టుడే: వాజేడు మండలానికి సాగునీరందించేందుకు మంజూరైన మోడికుంట ప్రాజెక్టు నిర్మాణంపై శాసనసభలో చర్చిస్తానని భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. వాజేడు మండలంలో సోమవారం చేపట్టిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఇందిరమ్మ గృహాల మంజూరు, రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణం తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. గోదావరి వరదలతో అవస్థలు తప్పడం లేదని, రహదారులు ధ్వంసమయ్యాయని, పంట పొలాలు ఇసుకమేటలతో నిండిపోయాయని చంద్రుపట్ల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన టేకులగూడెం, పెదగంగారం, చంద్రుపట్ల గ్రామాల సమీపంలో కరకట్ట నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కరకట్ట నిర్మాణానికి మంత్రులు, సంబంధిత అధికారులతో చర్చిస్తానన్నారు. పేరూరు పీహెచ్‌సీ సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డెనార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, పీఏసీఎస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అంజయ్య, జగన్నాథరాజు, నాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పుష్పలత, మాజీ ఎంపీపీ శారద తదితరులు ఉన్నారు.

నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : నిఘా నేత్రాల ఏర్పాటుతో నేరాల నియంత్రణతో పాటు అనుమానిత వ్యక్తులను సులువుగా గుర్తించే వీలు కలుగుతుందని మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావు అన్నారు. మండలంలోని అన్నారంలో పలు సీసీ కెమెరాలను ప్రారంభోత్సవం చేసి మాట్లాడారు. దొంగతనాలు, ఇతరత్రా నేరాల నియంత్రణకు నిఘా నేత్రాలు దోహదపడుతాయన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య సేవలు

ములుగు, న్యూస్‌టుడే: ప్రభుత్వ కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య నిపుణులచే వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య తెలిపారు. సోమవారం జిల్లా ఆసుపత్రిలో వివిధ విభాగాల ప్రత్యేక వైద్య నిపుణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారంలో మూడు రోజులు అందుబాటులో ఉన్న ప్రత్యేక వైద్యులు సేవలు అందించడానికి ప్రణాళిక తయారు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ ఆదేశాలు అందిన తర్వాత కార్యాచరణ అమలు చేస్తామన్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, ప్రత్యేక వైద్య నిపుణులు ప్రొఫెసర్లు డాక్టర్లు బిక్షపతిరావు, చంద్రశేఖర్ ప్రకాష్, సుధాకర్, వినయ్‌బాబు, ఉషారాణి, పవన్ తదితరులు పాల్గొన్నారు.


'పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి'




అమరవీరుల కుటుంబాలకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న ఎస్పీ శబరీష్

ములుగు టౌన్, న్యూస్‌టుడే: ప్రజారక్షణలో నిమగ్నమై విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా పోలీసు అధికారి ఎస్పీ శబరీష్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విధుల్లో ప్రాణాలర్పించిన అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ములుగు జిల్లాలో పోలీసులు ధైర్యంగా విధులు నిర్వర్తిస్తున్నారని, వరదల సమయంలో ప్రజలను రక్షించడంలో ప్రాణాలకు తెగించి శ్రమించారని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా అమరులైన 214 మంది పేర్లను అదనపు ఎస్పీ సదానందం చదివి వినిపించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, డీఎస్పీలు రాములు, రవీందర్, సీఐలు శ్రీనివాస్, షేక్ ముస్తాన్, ఎస్సైలు వెంకటేశ్వరరావు, తాజోద్దీన్, టీవీ సూరి, హరీష్, అమరవీరుల కుటుంబాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేవుడి మాన్యం.. ధరణిలో నిక్షిప్తం





జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరాలయం

రామన్నపేట(వరంగల్), న్యూస్‌టుడే

దేవుడి మాన్యాలు, ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ నడుం బిగించింది. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ఆధునిక, సాంకేతిక పద్ధతులు అవలంబిస్తోంది. గూగుల్ సహకారంతో దేవాలయాలు, భూములను జియో ట్యాగింగ్ చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 34,092 ఎకరాల భూములకు జియో ట్యాగింగ్ పూర్తయ్యింది. వీటిలో 57 శాతం ఆలయాల భూములను ధరణిలో నిక్షిప్తం చేశారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశానుసారం వరంగల్ ఉమ్మడి జిల్లాలో దేవాలయాలు, భూముల జియో ట్యాగింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది.



ములుగు జిల్లా మల్లూరు శ్రీలక్ష్మీనర్సింహస్వామి గుడి

- జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో దేవాదాయ శాఖ డివిజనల్ పరిశీలకులు, కార్యనిర్వహణ అధికారులు, ఉద్యోగులు రంగంలోకి దిగారు. ఇప్పటికే 1,062 వరకు ట్యాగింగ్ పూర్తయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే ఈ ప్రక్రియలో ఉమ్మడి వరంగల్ జిల్లా ముందంజలో ఉంది.
- దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలు, ధూపదీప నైవేద్యాల పథకం(డీడీఎన్) కింద ఎంపికైన దేవాలయాలు, వాటికి సంబంధించిన భూములు, ఆస్తులు, ధర్మ సత్రాలు ఇతర వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫొటోలు తీసి గూగుల్ సహకారంతో జియో ట్యాగింగ్ చేస్తున్నారు.
- దేవస్థానం, దేవుడి, ఇతర విశిష్టత కలిగిన ఫొటోలు, ఆలయం పేరు, చిరునామా ఇతర వివరాలు క్షేత్రస్థాయి నుంచి అప్‌లోడ్ చేస్తున్నారు.

ఎలా అరికడతారంటే..!

దేవాలయాల భూములు, ఇతర ఆస్తులు జియో ట్యాగింగ్ చేయడం వల్ల ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుంది. స్థలం వివరాలు, సరిహద్దులు, దేవస్థానం పేరు, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. జియోట్యాగ్ చేసిన ఆలయాల భూములు, స్థలాల డేటాను రిజిస్ట్రేషన్ శాఖకు అనుసంధానం చేస్తారు. దీంతో అక్రమ రిజిస్ట్రేషన్లకు ఆస్కారం ఉండదు. జియో ట్యాగింగ్‌తో పాటు జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కొందరు నిపుణులు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం.

- రామల సునీత, ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్

ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల భూములు, స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఇందులో భాగంగానే మొదటి దశలో జియో ట్యాగింగ్ చేసి, రెండో దశలో భూముల వివరాలన్నీ ధరణిలో నిక్షిప్తం చేస్తున్నాం. మిగిలినవి వారం నుంచి పది రోజుల్లో పూర్తి చేస్తాం.


టీజీ ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థినికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ డా. ప్రభాకర్

మట్టెవాడ, న్యూస్‌టుడే: టీజీ ఎప్‌సెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా. బైరి ప్రభాకర్ తెలిపారు. సోమవారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియకు 423 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్(బైపీసీ) పూర్తి చేసి, టీజీ ఎప్‌సెట్‌కు అర్హత సాధించిన విద్యార్థులు బీఫార్మసి, ఫామ్‌డీ, ఫార్మాసుటికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ నెల 23 వరకు ధ్రువపత్రాల స్లాట్ ఎంచుకోవచ్చని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి 6 గంటల వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. సీట్ అలాట్‌మెంట్ 28న జరుగుతుందని, ఈ నెల 30న ప్రవేశం పొందిన కళాశాలలో చేరాలని సూచించారు.

రైతేరాజు వివరాలు 6లో..



గురువులు లేక.. చదువులు సాగక..!





మూతపడిన కలిపాక గిరిజన ప్రాథమిక పాఠశాల

వెంకటాపురం(ములుగుజిల్లా), న్యూస్‌టుడే: మన్యంలో గిరిజన విద్య అటకెక్కింది. అధికారుల అనాలోచిన నిర్ణయం, బాధ్యతారాహిత్యంతో గాడి తప్పింది. బదిలీ ఉపాధ్యాయులను మరో ప్రాంతానికి పంపిన అధికారులు ప్రత్యామ్నాయం చూపకపోవడంతో చదువులకు మూత'బడి'ంది. గిరిజన సంక్షేమశాఖ విద్యావిభాగం, ఐటీడీఏ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం అడవి బిడ్డలకు శాపమైంది. వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం మండలాల్లోని నాలుగు పాఠశాలలు తాళం తెరుచుకోలేని దుస్థితి నెలకొంది.

ఉపాధ్యాయులు బదిలీ కావడంతో..

వెంకటాపురం మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన ముత్తారం, కలిపాక గిరిజన ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. వాజేడు మండలం జంగాలపల్లి గిరిజన ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులుండగా, ఈ బడిది ఇదే పరిస్థితి. కన్నాయిగూడెం మండలం సర్వాయి జీపీఎస్ కూడా ఉపాధ్యాయుడు లేక మూసివేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆగస్టు నెలలో ఈ బడుల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఏకోపాధ్యాయ బడులు కావడంతో రిలీవ్ చేసేందుకు వేచి చూసిన అధికారులు అకస్మాత్తుగా గత నెల 26వ తేదీన బదిలీ ఉపాధ్యాయులను పంపారు. ప్రత్యామ్నాయంగా ఎవరిని నియమించకపోవడంతో అప్పటి నుంచి ఈ బడులు మూతపడ్డాయి. ఇన్ని రోజులుగా గిరిజన బిడ్డలు చదువులకు దూరంగానే ఉంటున్నారు.

తాళాలు వేసిన ఈ గిరిజన ప్రాథమిక పాఠశాల వెంకటాపురం మండలంలోని ముత్తారం గ్రామానికి చెందినది. ఇక్కడ ఒకటి నుంచి ఐదు తరగతుల్లో 29 మంది గిరిజన బిడ్డలు ప్రవేశం పొందారు. ఈ బడిలో పాఠాలు బోధించే ఉపాధ్యాయుడిని బదిలీ అయిన తర్వాత అధికారులు ప్రత్యామ్నాయంగా మరొకరిని నియమించకపోవడంతో మూతపడింది. అడవి బిడ్డలకు చదువు దూరమైంది.

అంతా గప్.. చుప్..

గిరిజన సంక్షేమశాఖ విద్యావిభాగం పనితీరు విమర్శలకు దారి తీస్తోంది. ఏకోపాధ్యాయ బడుల్లోని ఉపాధ్యాయులను నిబంధనలకు విరుద్ధంగా రిలీవ్ చేసిన బాధ్యులు ప్రత్యామ్నాయ చూపకపోవడం వెనుక ఆంతర్యమేమిటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఈ నాలుగు పాఠశాలలు దసరా సెలవులను మినహా ఇస్తే పది రోజులకు పైగా తెరుచుకోకపోయినా అంతా గప్.. చుప్‌గానే ఉండటం విడ్డూరం. మారుమూల పల్లెల్లో ఎవరు ప్రశ్నించరని అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ.. విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నారు.

పాఠశాలలు తెరిచేలా చర్యలు

- పోచం, డీడీ, ఐటీడీఏ, ఏటూరునాగారం

వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం మండలాల్లోని నాలుగు పాఠశాలలు మూతపడిన విషయం మా దృష్టికి వచ్చింది. అనారోగ్యంతో ఇన్నాళ్లు తాను సెలవులో ఉన్నాను. ఆ సమయంలో ప్రత్యామ్నాయంగా సీఆర్‌టీలను ఏర్పాటు చేసినా.. విధుల్లో చేరనట్లు తెలిసింది. రెగ్యులర్ ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి, బడులు తెరిచేలా చర్యలు తీసుకుంటాం.

విరులు.. లాభాల సిరులు



నర్సంపేట, ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : బంతి పూల సాగు లాభదాయకంగా ఉండటంతో పలువురు రైతులు ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు.. స్వల్ప పెట్టుబడి.. తెగుళ్లు, చీడపీడల బాధలు తక్కువే.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రాజపల్లిలో ఎడ రమేశ్ ఎకరం భూమిలో, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్‌లో రైతు అంబాల కరుణాకర్ ఎకరంలో బంతి సాగు చేశారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో మార్కెట్‌లో ఆశించిన ధర పలుకుతోంది. రమేశ్ తన మిత్రుడి సాయంతో గత జులైలో ఈస్ట్‌వెస్ట్ కంపెనీకి చెందిన బంతి విత్తనాన్ని బెంగళూరు నుంచి తెప్పించి నారు పోసినట్లు తెలిపారు. నారు పోసిన 25 రోజుల తర్వాత మొక్కలు నాటారు. అంతరకృషి, మొక్కలకు ఎరువులు వేశారు. 52 రోజులకు రెక్కల పురుగు నివారణకు పురుగు పిచికారీ చేశారు. పూలు మొత్తం నాలుగు కోతలు వస్తాయి.

ఆదర్శం

మొదటి కోత తొలి బతుకమ్మ(అమావాస్య)కు కోయగా దిగుబడి టన్నున్నర వచ్చింది. కిలో రూ.80 ధర పలికింది. సద్దుల బతుకమ్మకు రెండో కోత మూడు టన్నుల దిగుబడి రాగా, ధర రూ.60-70 వరకు ధర పలికింది. ఈ రెండు విడతలో దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు రమేశ్ వివరించారు.



తోటలో పనులు చేస్తున్న రమేశ్ దంపతులు

రూ.2.5 లక్షలు వస్తాయని అంచనా..

-అంబాల కరుణాకర్, రైతు



రెండేళ్ల నుంచి బంతి సాగు చేస్తున్నాను. సుమారు రూ.3 లక్షల ఆదాయం వస్తుందని అంచనా.. పెట్టుబడి రూ.50వేలు పోగా రూ.2.5 లక్షలు చేతికి వస్తాయి..

ప్రశ్న- సమాధానం

? పత్తి పంటలో ఆకులు నల్లగా మారుతున్నాయి. ఎండిపోయి రాలుతున్నాయి. నివారణ చర్యలు తెలపండి..? -రైతు, రావుల లక్ష్మయ్య, సూధన్‌పల్లి.

✔ బ్యాక్టీరియాతో ఆకులు నల్లగా మారుతున్నాయి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ రెండు గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంట ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను నేల ద్వారా మొక్కలకు అందించాలి. పైపాటుగా లీటరు నీటికి 10 గ్రాముల యూరియా స్థూల పోషకాల మిశ్రమాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

-డా.రాజు, శాస్త్రవేత్త, కేవీకే వరంగల్

-వరంగల్ వ్యవసాయం



రైతేరాజు

ఈ సన్నరకాలకే.. రూ.500 బోనస్!



పాకాల ఆయకట్టులో సాగవుతున్న సన్నవరి

ఖానాపురం, గోపాలపూర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.. అయితే, ఏయే రకాలకు బోనస్ ఇస్తారో తెలియక అన్నదాతలు అయోమయంలో ఉన్నారు. ఇటీవల ఆయా రకాల జాబితాను వ్యవసాయ శాఖకు ప్రభుత్వం విడుదల చేసింది. 33 రకాల సన్నాల వరికి బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించారని వ్యవసాయాధికారి భోగ శ్రీనివాస్ 'రైతేరాజు'కు తెలిపారు. సిద్ధి(డబ్ల్యూజీఎల్44), కేపీఎస్ 2874(కంపాసాగర్ వరి-1), సాంబమశూరి, జగిత్యాల వరి-3, జగిత్యాల వరి-2, వరంగల్ సాంబ(వరంగల్ 14), వరంగల్ సన్నాలు, జగిత్యాల మసూరి, పొలాస ప్రభ(జేజీఎల్384), క్రిష్ణ(ఆర్ఎన్నార్2458), మానేరు సోన, తెలంగాణ సోన(ఆర్ఎన్నార్ 15048), వరంగల్ వరి-1119, కూనారం వరి-2, వరంగల్ వరి-2, రాజేంద్రనగర్ వరి-4, కూనారం వరి-1, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, అంజన(జేజీఎల్ 1118), నెల్లూరు మసూరి, ప్రద్యుమ్న సుగంధ సాంబ, శోబిని, సోమనాథ్, ఆర్ఎన్నార్, కేపీఎస్ 6261, జేసీఎల్ 33124, హెచ్ఎంటీ సోన, మారుతేరు సాంబ, మార్టేరు మసూరి, ఎంటీయూ 1271 రకాలు జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు సన్నాలుగా ఉండి 6 మి.మీ పొడవు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉన్న పరిమాణాన్ని పరిగణలోకి తీసుకొని సన్నరకంగా గుర్తించి బోనస్ చెల్లిస్తారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా వ్యవసాయాధికారులు వెర్నియర్‌కాలిపర్స్‌తో సూక్ష్మ కొలతలు గణించి ప్రతి వడ్ల కుప్పను పరిశీలించి నిర్ధారణ చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా రైతు పండించిన పంట మొత్తాలకు బోనస్ ఇస్తారా..? రైతు భరోసాకు ఇచ్చే కటాఫ్ ఎకరాలకు ఇస్తారో ఇంకా నిర్ణయించలేదు.

-న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

రైతుకు భరోసా.. మాన్‌ధన్ యోజన



కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన ద్వారా వయసు పై బడిన రైతులకు సామాజిక భద్రత కల్పిస్తోంది. గరిష్ఠంగా రెండు హెక్టార్లు(5 ఎకరాలు)లోపు సాగు భూమి ఉండి 18-40 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులు.. అధికారులు, ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు ఇతర వృత్తి నిపుణులు దీనికి అనర్హులు.. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవారు, నిర్దేశించిన దాని కంటే అధిక రాబడి పొందుతున్నవారు, ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందినవారు కూడా పథకంలో చేరడానికి వీల్లేదు.. రైతులు కామన్ సర్వీసు కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలి. ఫొటో, నివాస, ఆదాయ, ధ్రువీకరణ, వయసు నిర్ధారణ, సాగు భూమి పత్రాలు, ఆధార్ కార్డు సమర్పించాలి. పీఎంకేఎం పోర్టల్‌లో నమోదు చేశాక చరవాణి నంబరుకు సందేశం వస్తుంది. ప్రత్యేకంగా పింఛను ఖాతా తెరిచి కార్డు ఇస్తారు. ఇందుకైన ఖర్చు రూ.30లను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

వయసు ఆధారంగా ప్రీమియం : పథకంలో చేరిన రైతులు వయసును బట్టి ప్రీమియం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వారు తన వాటాగా రూ.55 చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం రూ.55 కలిపి బీమా కంపెనీకి రూ.110 చెల్లిస్తుంది. ఏటా వయసును బట్టి ప్రీమియం రూ.3 నుంచి రూ.10 వరకు పెరుగుతుంది. 40 ఏళ్లకు పైబడిన వారు రూ.200 చెల్లించాలి. ఇంతే మొత్తం ప్రభుత్వమూ చెల్లిస్తుంది. 60 ఏళ్లు వచ్చే వరకు ప్రీమియం కట్టాలి. ఆ తర్వాత ప్రతి నెలా రూ.3 వేల చొప్పున పింఛను వస్తుంది. ఒకేసారి డబ్బులు కావాలనుకుంటే రైతు కట్టిన, సర్కారు చెల్లించిన మొత్తంలో సగం ఒకేసారి అందజేస్తారు.

నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లిస్తేనే.. -కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

లబ్ధిదారు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛను రూ.1500 ఇస్తారు. పథకాన్ని కొనసాగించేందుకు కనీసం అయిదేళ్లపాటు రైతు వాటా నెలవారీ కిస్తీలను నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి.

షట్లర్ శ్రీచేతన్‌శౌర్యకు రెండో ర్యాంకు



వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా సబ్ జూనియర్(అండర్-13) బ్యాడ్మింటన్ ర్యాంకింగ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారుడు శ్రీచేతన్‌శౌర్య తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. బాలుర డబుల్స్ విభాగంలో 2వ స్థానంలో, సింగిల్స్‌లో 4వ స్థానంలో నిలిచాడు. ఇటీవల జరిగిన పలు జాతీయస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించి.. వ్యక్తిగత ర్యాంకింగ్‌లో దూసుకెళ్లాడు. హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన శ్రీచేతన్‌శౌర్య ఆటతీరు అభినందనీయమని వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి రమేష్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు డా. రమేష్‌కుమార్, నాగకిషన్ పేర్కొన్నారు.

అమ్మ కోసం.. సాంకేతిక బాట

యాప్‌పై శిక్షణకు శ్రీకారం

ఇంట్లో కూతురు/కోడలు గర్భం దాల్చితే బాగోగులను పెద్దవాళ్లు చూసుకుంటారు. ఇప్పుడిక ట్రెండ్ మారుతోంది. రానున్న రోజుల్లో ఆధునిక చేదోడు కానుంది. సాంకేతిక బాట పట్టిన గర్భ సంరక్షణ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. నేషనల్ హెల్త్ మిషన్, యునిసెఫ్ భాగస్వామ్యంతో అర్మాన్ అనే స్వచ్ఛంద సంస్థ రూపకల్పన చేసిన 'అమ్మ కోసం' యాప్ ప్రయోజనకరంగా మారనుంది. ఇది గర్భిణులు, బాలింతలు, పిల్లల శ్రేయస్సుకు దోహదపడుతుంది.

అమ్మ కోసం యాప్‌ను అమలు చేయడానికి ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఆరు జిల్లాల పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఇటీవల ప్రారంభించారు. -న్యూస్‌టుడే, డోర్నకల్

ఆరోగ్య కల సాకారం

అరచేతిలో స్మార్ట్‌ఫోన్ ఇమిడి ఉంది. ప్రసవం జీవితంలో ఒకేగా మారింది. ప్రస్తుత 'అమ్మ-కోసం' యాప్ పురుడు పోసుకోవడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య సంబంధ అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చే ప్రధాన వరూ మారింది. గర్భధారణ సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం ఎలా? పిండం ఎదుగుదలను పర్యవేక్షించడం ఎలా?.. తదితర అంశాలను తెలుసుకునే వీలుంది. లోపాలుంటూ వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్‌లో అమ్మ-కోసం యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అవసరమైన అనుమతులు అంగీకరించాక లాగిన్ స్క్రీన్ కనిపిస్తుంది.
☛ యూజర్ నేమ్, పాస్‌వర్డు నమోదు చేసి 'రిమెంబర్ మీ' చెక్‌బాక్స్ మీద నొక్కాలి.
☛ తెరపై ఐకాన్‌ల పేరిట 'డ్యాష్‌బోర్డ్' కనిపిస్తుంది.
☛ బ్యాక్ గ్రౌండ్‌లో చూపిన విధంగా ఆఫ్‌లైన్‌లో ఉపయోగించుకునేందుకు అన్ని కోర్సు-లెసన్ ఫైళ్లను సైతం డౌన్‌లోడ్ చేస్తుంది. ఒకవేళ ఆటోమెటిక్‌గా డౌన్‌లోడ్ కాని పక్షంలో 'సింక్ ఐకాన్'పై క్లిక్ చేస్తే డౌన్‌లోడ్ అవుతుంది.

ఇవీ ప్రయోజనాలు..

☛ లెర్నింగ్ మేనేజ్‌మెంటు సిస్టం(ఎల్ఎంఎస్) ద్వారా పీడీఎఫ్, వీడియో, ఆడియో, ఇమేజ్ వివిధ ఫార్మాట్లలో కోర్సు పాఠాల వీక్షణకు ఇది వీలు కల్పిస్తుంది.
☛ కోర్సు లెసన్ ఫైళ్లలోకి వెళితే.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న వాటితో పాటు ప్రారంభించని కోర్సుల జాబితా కనిపిస్తుంది. చిట్కాలు అందిస్తుంది
☛ ప్రసవానికి ముందు, తర్వాత చేయాల్సిన వ్యాయామాలను ఇది సూచిస్తుంది
☛ మంచి పోషణకు ఆహారాన్ని తీసుకోవడంలో తోడుంటుంది
☛ బాలింతలకు అవసరమైన సూచనలు చేస్తుంది
☛ పిల్లల విషయంలో జాగ్రత్తలను తెలుపుతుంది.

ఉమ్మడి జిల్లా స్వరూపం

జిల్లా	గర్భిణులు	బాలింతలు	పిల్లలు
మహబూబాబాద్	4930	3943	44837
జయశంకర్ భూపాలపల్లి	2653	2431	24476
హనుమకొండ	4231	3987	45552
వరంగల్	6128	6432	50423
జనగామ	3396	2430	23643
ములుగు	2874	2497	21624

గర్భిణులకు మేలు

- డా.మధుసూదన్, జిల్లా వైద్యాధికారి, శ్రీదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

అమ్మ-కోసం యాప్ గర్భిణులకు ఒక కల్పతరువు. హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిలో గర్భస్థ సమయంలో కొవిడ్, రక్తహీనత, అధిక రక్తపోటు, ప్రసవపూర్వ రక్తస్రావం, మధుమేహం, గత సిజేరియన్ స్థితి, పిండం ఎదుగుదల ముఖ్యమైనవి. యాప్‌ను ఏఎన్ఎంల ట్యాబ్‌లలో డౌన్‌లోడ్ చేశారు. పదిహేను రోజులకు ఒకసారి ఒక్కో అంశంపై వీరికి ఒక లింక్‌ను ఆడియో/వీడియో రూపంలో పంపిస్తారు.

తెలుగులో సులభంగా అర్థం అవుతుంది

- సీహెచ్ స్వప్న, ఏఎన్ఎం, భూపాలపల్లి



అమ్మ కోసం యాప్ తెలుగులో ఉండటంతో సులభంగా అర్థమవుతోంది. శిక్షణలో గర్భిణులు, వారు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, చికిత్సకి సంబంధించిన అంశాలను వివరించారు.



భూపాలపల్లిలో శిక్షణకు హాజరైన ఏఎన్ఎంలు

నేటి నుంచి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

వరంగల్ క్రీడావిభాగం : వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ ప్రతినిధి కన్నా తెలిపారు. హనుమకొండలోని తితిదే వేడుకల మందిరంలో అండర్-15 విభాగంలో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే బాలబాలికలు తమిళనాడులో జరిగే జాతీయస్థాయిలో పాల్గొంటారని చెప్పారు.

'కల్వకుంట్ల కుటుంబం ఆస్తుల వివరాలు ప్రకటించాలి'

జనగామ, న్యూస్‌టుడే: 'కల్వకుంట్ల కుటుంబానికి నిజాయతీ ఉంటే, 2014లో మీ ఆస్తులు ఎన్ని, ఇప్పుడెన్ని? అనే వివరాలను ప్రకటించాలని' మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, సంతోష్, హరీశ్‌రావు పలు అధికార కూటమిగా మారి దోపిడీ చేశారని ఆరోపించారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా విపణిలో సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్న సభలో శ్రీహరి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో కమిషన్ల కోసం పనులు తప్ప, అభివృద్ధి జరగలేదని, అందుకే ప్రస్తుతం సమస్యలు పేరుకున్నాయని విమర్శించారు. విద్య, ఉపాధిపై సమీక్షకు గంట సమయం ఇవ్వలేదని, ప్రజా సమస్యలపై మాట్లాడే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. ప్రభుత్వం ఆరు నెలల్లో విజయవంతంగా పూర్తి చేసి 11 వేల కోట్లను రైతులకు రుణ మాఫీ చేసిందన్నారు. భాజపా నాయకత్వం అభివృద్ధి కోసం కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రఘునందన్‌రావు, ఈటల పోటీపడుతున్నారన్నారు. మూసీ, హైడ్రా విషయంలో వారి మాటల్లో పొంతన లేదని, ఒక్కసారైనా కలిసి ఈ అంశాలపై స్పష్టతనివ్వాలని ప్రశ్నించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులతో ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప సంకల్ప బలంతో ముందుకు వెళ్తోందని వివరించారు.

డమ్మీ తుపాకితో బెదిరించిన దుండగుడికి దేహశుద్ధి



నిందితుడు

దామెర, న్యూస్‌టుడే: డబ్బులివ్వాలని డమ్మీ తుపాకితో కిరాణ దుకాణం యజమానిని బెదిరించిన వ్యక్తికి గ్రామస్థులు దేహశుద్ధి చేసిన సంఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు కందికొండ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఊరుగొండకు చెందిన సంపత్ జాతీయరహదారి పక్కన కిరాణ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఓ వ్యక్తి వచ్చి దుకాణం షట్టర్‌ను తట్టి బిస్కెట్ ప్యాకెట్ కావాలని కోరాడు. దీంతో సంపత్ షట్టర్ తెరవగానే.. దుండగుడు డమ్మీ తుపాకి చూపించి డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవంటూ సంపత్ భయంతో కేకలు వేశారు. స్థానికులు వచ్చి ఆ వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సంపత్ తెలిపారు. దుండగుడు గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. నిందితుడిని విచారిస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

పాఠశాలలో సార్వత్రిక ప్రవేశాలు షురూ!

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలావరంగల్ మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ మూరాల శంకరరావు తెలిపారు. సోమవారం ప్రవేశాల ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. ఇతర వివరాలకు పాఠశాలల అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శైలేంద్రకుమార్ 96034 86850 సంప్రదించాలన్నారు.

ప్రజాసేవలో పోలీసులు ముందుంటారు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాసేవలో పోలీసులు ముందుంటారని అమరుల ఆశయ సాధనకు పనిచేస్తూ విధుల్లో రాణించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. సోమవారం కమిషనరేట్‌లో అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్‌డే) నిర్వహించారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మృతి చెందిన 241 మంది పోలీసు అమరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య, కర్నల్ రవికుమార్, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్‌తో పాటు ఏసీపీలు ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐ, పోలీసు అమరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు సిబ్బంది అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఆర్ఐ స్పర్జన్ సారథ్యంలో సాయుధ పోలీసుల శోక్‌శ్రస్త చేసి మరణించిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రజల సేవ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు త్యాగధనులన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు పనిచేయాలన్నారు. నీతి నిజాయతీతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. అమరవీరులు ఎల్లప్పుడూ మన గుండెల్లోనే ఉంటారన్నారు. వారి కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వారికి ఎలాంటి సమస్యలున్నా పోలీసు విభాగం తరపున సహకారం అందిస్తామన్నారు. అనంతరం కమిషరనేట్ నుంచి హనుమకొండ మిషన్ ఆసుపత్రి వరకు పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు కలిసి ప్రదర్శన నిర్వహించారు. పోలీసు జాగృతి కళా బృందం సభ్యులు పాల్గొని పోలీసు అమరులకు జోహార్లు అర్పించారు.



అమరవీరుల స్తూపం అలంకరణ



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా. చిత్రంలో పై వరుస(ఎడమ నుండి కుడికి) హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావిణ్య, సత్య శారద, ఎన్‌సీసీ కమాండెంట్ కర్నల్ రవీంద్ర కుమార్ రవి, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్. కింది వరస పోలీసు ఉన్నతాధికారులు రవి, మధుసూదన్, నందిరాం నాయక్, సత్యనారాయణ, దేవేందర్ రెడ్డి



స్మృతి పరేడ్‌లో పోలీసుల నివాళి

నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటా

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం చేసి, మృతి చెందిన లకావత్ శ్రీను కుటుంబ సభ్యులను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ పరామర్శించారు. పాలకుర్తి మండలం మేకలతండాలోని శ్రీను నివాసాన్ని ఆయన సోమవారం సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. శ్రీను మృతి ప్రభుత్వ హత్య అని అభివర్ణించారు. గిరిజన బిడ్డ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని వివరించారు. కాంగ్రెస్ నేత యాకాంతరావు ప్రమేయం ఈ ఘటనలో ఉందని తెలిసిందని, పోలీసులు ఉన్నా, అందరికీ శిక్ష పడేలా సీపీ, డీసీపీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. పోలీసులు విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, నాయకులకు ఒత్తాసు పలకడం సరికాదని అసహనం వ్యక్త చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, భాజపా జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌రెడ్డి, తండావాసులు గాంధీ నాయక్, సురేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, చిత్రంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, తదితరులు

గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

ఎనుమాముల మార్కెట్: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఎనుమాముల మార్కెట్ యార్డులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి.. గరిష్ఠ ధరను పొందాలన్నారు. తేమ వల్ల రైతులు నష్టపోకుండా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తొలివిడతలో వరంగల్ జిల్లాలోని 14 కేంద్రాల్లో సోమవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభించామని వరంగల్ కలెక్టర్ డా.సత్యశారద పేర్కొన్నారు. మిగతా చోట్ల త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీసీఐ డిప్యూటీ మేనేజర్ అర్జున్ దవే, జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శి నిర్మల, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ డా.సత్యశారద తదితరులు

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



చల్వాయి ఐదో బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్ అలెక్స్, ఇతర అధికారులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: సమాజంలో శాంతి స్థాపనే లక్ష్యంగా విధి నిర్వహణలో భాగంగా తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన పోలీసు అమరవీరుల ఈతరం పోలీసులకు స్ఫూర్తి దాయకమని టీఎస్ఎస్పీ ఐదో బెటాలియన్ కమాండెంట్ టి.అలెక్స్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోవిందరావుపేట మండలం చల్వాయిలోని టీఎస్ఎస్పీ ఐదో బెటాలియన్‌లోని అమరవీరుల స్తూపం వద్ద అలెక్స్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సాయుధ పోలీసులు శోక్ శస్త్ర నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేసి అమరులైన పోలీసు అధికారుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలుగా తాము అండగా నిలుస్తామని ఆయన పేర్కొన్నారు. సహాయ కమాండెంట్లు అనిల్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఐలు కార్తీక్, సాల్మన్ రాజు, శ్రీనివాసులు, అన్నయ్య, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నూతన కార్యవర్గం



గోవిందరావుపేట, ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లా లారీ యజమానుల సంఘం నూతన కార్యవర్గం ఇటీవల ఎంపికైంది. నూతన కార్యవర్గం సభ్యులు సోమవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు రాంబాబు, గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు తిరుపతిరెడ్డి, ఎస్.కె.ఖాజాపాషా, కోశాధికారి ఖాదర్, సంయుక్త కార్యదర్శి భిక్షంరెడ్డి, కార్యవర్గసభ్యులు సంపత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు: నూతనంగా ఎన్నికైన జిల్లా రైసు మిల్లుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ములుగులో సీతక్కను కలిశారు. మంత్రి నూతన కార్యవర్గాన్ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ రైతుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అధ్యక్షుడు ప్రవీణ్, గౌరవ అధ్యక్షుడు సమ్మిరెడ్డి, కార్యవర్గ సభ్యులున్నారు.

ఉత్సవ కమిటీలకు నిధులు అందించాలి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలకు ప్రభుత్వం రూ.18 లక్షలు విడుదల చేసిందని, సంబంధిత నిధులను ఉత్సవ కమిటీలకు అందించాలని ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, లంబాడా ఐక్య వేదిక అధ్యక్షుడు పోరిక గోవింద్‌నాయక్ ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లను కోరారు. ఏటూరునాగారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంత్ సేవాలాల్ ఉత్సవ నిర్వహణకు ప్రభుత్వం ఆరు జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో నిధులు జమచేసిందని, వెంటనే వాటిని ఇవ్వాలన్నారు. నాయకులు సోమానాయక్, సునిల్‌కుమార్, దేవ్‌సింగ్, పాడ్య కుమార్, రతన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విన్నవించాం.. కనికరించండి..!

ములుగు, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ జి.సంపత్ అన్నారు. సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ఆర్డీవో కె. సత్యపాల్ రెడ్డితో కలిసి పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. కొన్నింటిని తక్షణమే పరిష్కరించి వెంటనే సాధ్యం కానివాటిని వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులకు సిఫార్సు చేశారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీల విషయంలో ఎలాంటి జాప్యం చేయొద్దని, పరిష్కారంలో అలస్యమైతే కారణాలను ఫిర్యాదుదారుకు తెలియజేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు వినతులను పెండింగ్ లేకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మొత్తం 42 దరఖాస్తులు స్వీకరించగా, ఎక్కువగా భూసమస్యలు, ఇళ్లకు సంబంధించినవి వచ్చాయి. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, డీపీవో సర్దార్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా వ్యవసాయాధికారి సురేష్, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి లక్ష్మణ్, డీవీవో దేవరాజ్, జిల్లా బీసీ సంక్షేమాధికారి రవీందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దారులు పాల్గొన్నారు.

అర్జీల వివరాలు

భూ సమస్యలు: 16
ఇందిరమ్మ ఇళ్లు: 5
ఉద్యోగాలు: 6
ఆసరా పింఛన్లు: 5
ఇతర సమస్యలు: 10



దరఖాస్తు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ జి.సంపత్‌రావు

కన్నవారు పట్టించుకోవడం లేదు

- చల్లా హంసిరెడ్డి, పాల్‌సాబ్‌పల్లి, ములుగు



నాకు ఇద్దరు కొడుకులు. వారికి నాకున్న ఎనిమిదెకరాల భూమిని ఇద్దరికి నాలుగెకరాల చొప్పున పంచి ఇచ్చాను. ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నా. నన్ను పట్టించుకోవడం మానేశారు. నాపేరున ఉన్న ఎనిమిది గుంటల భూమిని ఆసుపత్రి ఖర్చుల కోసం అమ్ముకుంటానంటే అడ్డుపడుతున్నారు. పలుమార్లు పెద్దల సమక్షంలో చేసుకున్న ఒప్పందాలను కూడా పట్టించుకోవడం లేదు. అధికారులు చొరవ చూపి నా ఆస్తిని కాపాడాలి.

భూమిని ఆక్రమించారు..

- కొంపెల్లి కిరణ్, చల్వాయి, గోవిందరావుపేట



మా నాన్న రాజిరెడ్డి కిష్టయ్య అనే వ్యక్తి వద్ద ఎనిమిదెకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆ తర్వాత రెవెన్యూ రికార్డుల్లో కూడా నమోదైంది. మా నాన్న 2016లో చనిపోయాడు. నేను జీవనోపాధి కోసం హైదరాబాదులో ఉంటున్నా. స్థానికంగా కొందరు ఆ భూమిని ఆక్రమించుకొని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

రాయితీ రుణం ఇప్పించాలి..

- బోట శ్రీనివాసరావు, వెంకటాపురం



ఒడ బలిజ సామాజిక వర్గానికి చెందిన నేను.. చేపలు పట్టడం, అమ్మడం చేస్తుంటా. చేపలు పట్టి వాటికోసం మత్స్యశాఖ ద్వారా పలు రకాల రాయితీ పథకాలు అందజేస్తోంది. లైవ్ ఫిష్ వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించి, రాయితీ రుణాన్ని మంజూరు చేయాలి.

పరిష్కారంలో జాప్యం సరికాదు



వినతిని స్వీకరిస్తున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో పీవో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పరిష్కారంలో జాప్యం తగదని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ● ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామంలో కొలువుదీరిన గోవిందరాజులు స్వామి వారి జాతర సమీపిస్తున్న నేపథ్యంలో గుడి అభివృద్ధికి, జాతర నిర్వహణ ఏర్పాట్లకు నిధులు కేటాయించాలని సంబంధిత ఆలయ ప్రధాన పూజారి దబ్బకట్ల గోవర్ధన్ పీవోకి విన్నవించారు. ● మహదేవ్‌పూర్ మండలానికి చెందిన మాజీ ఎంపీపీ నర్సింగరావుతో పాటు మరో పది మంది తమ మండలంలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని అర్జీ సమర్పించారు. ● పదెకరాల పోడు భూమికి అటవీ హక్కుల కింద పట్టాదారు పాసు పుస్తకాలు పొందానని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తాడ్వాయి మండలం వీరాపురం గ్రామానికి చెందిన గుమ్మడి నటరాజ్ కోరారు. ● ఆరు నెలలుగా వేతనాలు రావడంలేదని, వేతనాలు మంజూరయ్యేలా చూడాలని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల సీఆర్‌టీలు పీవోకి అర్జీ ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

చెత్త తొలగింపు

స్పందనకు వందనం

వాజేడు, న్యూస్‌టుడే: మొరుమూరు పంచాయతీలోని వివిధ గ్రామాలలోని కుండీలలో నిండిపోయిన చెత్తను పంచాయతీ సిబ్బంది తొలగించారు. 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికలో గ్రామస్థులు చేసిన విజ్ఞప్తిపై పంచాయతీ కార్యదర్శి కార్తీక్ స్పందించారు. సిబ్బందిని అప్రమత్తం చేసి గ్రామాలలో చెత్తను సేకరించి ట్రాక్టరు ద్వారా సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించారు.

'వసతిగృహాల సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం'

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని పలు వసతిగృహాల వార్డెన్లు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, అలాంటి వార్డెన్లపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిరిపల్లి జీవన్ అన్నారు. తమ సర్వేలో పలు విషయాలు వెలుగు చూశాయన్నారు. వసతిగృహాల్లో మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. పలు వసతిగృహాల్లో ఫ్యాన్లు తిరగడం లేదని, మెనూ ప్రకారం భోజనాలు పెట్టడం లేదని, రాత్రి వేళల్లో విద్యార్థులు ఇష్టారీతిగా తిరుగుతున్నా. . అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరవింద్, అరుణ్, శ్రావణ్, గణేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

మంగపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని భాజపా సోషల్ మీడియా ఇన్‌ఛార్జి ఎంబటి నవీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. దేశానికి వెన్నుముఖ అయినటువంటి రైతులనే వంచిస్తున్న కాంగ్రెస్‌ను ఎవ్వరు నమ్మడంలేదన్నారు. పూటకో మాట చెబుతూ కాలాన్ని వెల్లదీస్తున్న తెలంగాణ సర్కారు ఇంకెన్నాళ్లు ప్రజలను మోసం చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎంతగానో ఎదురు చూస్తున్న రైతు భరోసా ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కనీసం 20 హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పతనం తప్పదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి



ములుగు, న్యూస్‌టుడే: ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏవో రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అమ్జద్‌పాషా మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందించాలని కోరారు. నాయకులు బోడ రమేష్, కొయ్యడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కాటాపురం(తాడ్వాయి), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడు సుతారి పాపారావు డిమాండ్ చేశారు. తాడ్వాయి మండలంలోని కాటాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ.. రాబోయే కొద్దిరోజుల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున ఉపాధ్యాయులందరూ నూతనంగా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని కోరారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు బాణాల సుధాకర్, ఉపాధ్యాయులు అక్బర్‌పాషా, జీవన్‌లాల్, సమ్మయ్య, జైపాల్, వెంకటేశ్వర్లు, సాంసంగ్, విజయ, శ్రీదేవి తదితరులున్నారు.

ఖోఖోలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారంలోని గిరిజన క్రీడల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్.భీమయ్య, జె.పండు, వి.సాగర్, చందు అనే నలుగురు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపియ్యారు. ఈ నెల 20న వరంగల్‌లో నిర్వహించిన జూనియర్ ఛాంపియన్‌షిప్ ఖోఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లుగా ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వీరంతా త్వరలో మహబూబాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్, పీడీ పృథ్వీరాజ్, క్రీడల పాఠశాల ప్రిన్సిపల్ రాజునాయక్, పీడీ గణేష్, అధ్యాపకులు అభినందించారు.

మాలల సమస్యలపై పోరాటం చేస్తాం..



సమావేశంలో పాల్గొన్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి, శ్రేణులు

ములుగు, న్యూస్‌టుడే: మాలల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాటం చేస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అన్నారు. సోమవారం ములుగులో మాల న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందన్నారు. త్వరలో నూతన జిల్లా కమిటీ వేసి అన్ని గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. న్యాయవాదులు రాజమల్ల సుకుమార్, మన్నె కరుణాకర్, దాసండ్ల సుధాకర్, మంద విజయ్‌కుమార్, కర్నె ప్రణయ్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రాజేందర్, ఐలయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన ములుగు పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ రైస్ మిల్లులో పని కోసం బీహార్ నుంచి వచ్చిన ఇద్దరు కార్మికులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, పట్టణంలోని మహర్షి కళాశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

'జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం'

ములుగు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ములుగు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం సంస్కరణలను వేగవంతం చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని చెబుతోందని ఆరోపించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అనే ప్రాతిపదికన పేర్కొంటూ ఒకే భాష హిందీని దేశవ్యాప్తంగా బలవంతంగా ఇతర రాష్ట్రాలపై రుద్దుతున్నారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. దామాషా పద్ధతి ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని డిమాండు చేశారు. నాయకులు రత్నం రాజేందర్, పొదిలి చిట్టిబాబు, గొంది రాజేష్, అల్వాల ఐలయ్య, కడారి నాగరాజు, కొర్ర రాజు, గుండెబోయిన రవి, రత్నం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ నాయకులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం జై జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఈ నెల 24న అన్ని ప్రాంతాల నుంచి ఆదివాసీలు, ఆదివాసీల ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ ఎమ్మెల్యే విక్రమ్ మాండవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తదితర ఆదివాసీ పెద్దలు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ రాష్ట్ర నాయకులు పొదెం కృష్ణప్రసాద్, కోటె రవి, పొడెం రత్నం, పొడెం బాబు, చింత కృష్ణ, వట్టం జనార్దన్, చందా మహేష్, ఆలం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న భారాస జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: భారాస జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు ఏటూరునాగారం మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన జనగాం రాజేష్ అనే వైద్య విద్యార్థికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేష్ మంచిర్యాల జిల్లా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ విద్యలో సీటు సాధించినా.. చదువుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల సాయం కోరాడు. స్పందించిన భారాస జిల్లా అధ్యక్షుడు స్వచ్ఛందంగా ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, నాయకులు మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్‌రావు, సప్పిడి రాంనర్సయ్య, తాడూరి రఘు, ధన్నపునేని కిరణ్, కాళ్ల రామకృష్ణ, పర్వతాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి..

కమలాపురం(మంగపేట): మండలంలోని కమలాపురానికి చెందిన ఎంపీపీ నర్సింహారావుకు తోటి స్నేహితులు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. చిన్ననాటి స్నేహితుడు నర్సింహారావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న అతని పదో తరగతి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. ఇప్పలపెల్లి రమేశ్, నల్లూరి నాగేశ్వర్‌రావు, కోరుకొప్పుల శంకర్, బండారి లింగమూర్తి, వేమారవి, టి. రాంబాబు, వి. రమేశ్, టి. చంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి దారి ఏదీ..!



గ్రామీణ పల్లెలను దారి కష్టాలు వీడటం లేదు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక ద్వారా ఆ కాలనీలను ప్రగతిపథంలో నిలుపుతున్నట్లు పాలకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అవస్థలు తప్పడం లేదు. వెంకటాపురం మండల కేంద్రంలోని హరిజనకాలనీ(అంబేడ్కర్‌నగర్)లో అంతర్గత దారి అధ్వానంగా మారడంతో.. స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. వానాకాలమైతే మరీ దుర్భరంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నరకయాతనగా ఉన్న ఈ మార్గాన్ని బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, వెంకటాపురం

26న ధర్మయుద్ధ మహాసభ

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఈ నెల 26న ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోని నిర్వహించే మాదిగ ధర్మయుద్ధ మహాసభకు జిల్లా నుంచి మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ భూపాలపల్లి జిల్లా ఇన్‌ఛార్జి అంబాల చంద్రమౌళి కోరారు. భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం అసెంబ్లీ సాక్షిగా దేశంలోనే మొదటిసారిగా తానే వర్గీకరణ చేస్తానని.. అవసరమైతే గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లకు ప్రత్యేకంగా ఆర్డినెన్స్ తీసుకొస్తానని.. ఇచ్చిన హామీల ప్రకారం మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమిటీలు, కమిషన్ల పేర్లతో కాలయాపన చేస్తూ.. మాదిగలను నమ్మించి మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 26న జరిగే మాదిగల ధర్మయుద్ధ మహాసభకు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారని, సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

గిరిజన పల్లెల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు



మురికాల శిబిరంలో

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలంలోని గిరిజన పల్లెల్లో సోమవారం ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించారు. ఎదిర పీహెచ్‌సీ పరిధిలోని మరికాల, రాచపల్లి, చొక్కాల, వీరభద్రవరం, నూగూరు, ఆలుబాక, వెంకటాపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో చికిత్సలు చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులను పరీక్షించి వైద్యసేవలందించారు. అసంక్రమిత వ్యాధుల గుర్తింపుతో పాటు పూర్వపు రోగులకు మందులు, ఆరోగ్య సలహాలు తెలియజేశారు. ఈ శిబిరాల్లో ఎంఎల్‌హెచ్‌పీ బి జ్యోతి, వైద్యులు పవన్‌కల్యాణ్, వినయ్, డీపీఎంవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహ బంధం..!

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థుల దుర్మరణం



పొదల్లోకి దూసుకెళ్లిన కారును పరిశీలిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక



అరుణ్‌కుమార్, మణికంఠ (పాతచిత్రాలు)

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: వారిద్దరు బాల్య స్నేహితులు.. గ్రామంలోనూ కలిసి, మెలిసి తిరిగేవారు.. ఒకరు ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతుండగా, మరొకరు మహబూబాబాద్‌లోని పత్తిపాక మహాత్మజ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వారిద్దరిని సోమవారం జరిగిన రహదారి ప్రమాదంలో మృత్యువు కాటేసింది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన వివరాల మేరకు.. గూడూరు మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన నీల రమేష్- గౌతమి దంపతుల రెండోకుమారుడు నీల అరుణ్‌కుమార్(18), అదే గ్రామానికి చెందిన సంగెం ఉపేందర్- మంజుల దంపతుల కుమారుడు సంగెం నీలకంఠ(19) సోమవారం మధ్యాహ్నం పొనుగోడు నుంచి మహబూబాబాద్‌కు బయలుదేరారు. తన మిత్రుడైన అరుణ్‌కుమార్‌ను జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపులే కళాశాలకు పంపించేందుకు మణికంఠ ద్విచక్రవాహనంపై అతనికి తోడుగా వెళ్లాడు. జమాండ్లపల్లి అర్బన్ పార్కు సమీపంలోని జాతీయ రహదారిలో మహబూబాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొని వారిద్దరి ప్రాణాలను బలి కొంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి సంఘటనాస్థలికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి మృతదేహాలను 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడమే ప్రమాదానికి కారణమని సీఐ తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యుల బంధువుల రోదనలు మిన్నంటాయి.

పొనుగోడులో విషాదం...

పొనుగోడుకు చెందిన ఇద్దరు స్నేహితులు ఒకే రోజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంలో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రమేష్-గౌతమి దంపతులకు ముగ్గురు కుమారులు కాగా రెండోకుమారుడు అరుణ్‌కుమార్. వ్యవసాయం చేసుకుంటూ తమ పిల్లలను చదివిస్తున్నారు. ఉపేందర్-మంజుల దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడిని కూలీ పనులు చేస్తూ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో చదివిస్తున్నారు. దసరా సెలవుల అనంతరం స్నేహితుడిని కళాశాలకు పంపి మరుసటి రోజు తానుకూడా కళాశాలలకు వెళ్లాలనుకున్నారు. కాని ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో ఒకేసారి ఇద్దరు మృతి చెందడం పొనుగోడు గ్రామంలో విషాదం నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

'బాలలను పనిలో పెట్టడం నేరం'



చట్టాలపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు

ములుగు, న్యూస్‌టుడే: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పాన్ ఇండియా రిహాబిలిటేషన్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం ములుగులోని వ్యాపార వర్గాల యజమానులకు బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. బాల కార్మికులను పనిలో చేర్పించుకోవద్దని, వారితో పని చేయించుకోవడం నేరమని సూచించారు. మా దుకాణంలో బాల కార్మికులు లేరని పేర్కొంటూ స్టిక్కర్ అంటించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోతు స్వామిదాస్, అసిస్టెంటు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, డీసీపీవో జె. ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.